సాక్షి
చిత్తూరు
బుధవారం । 1 । మే । 2024



వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు పెద్దసంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరారు. - 8లో



‘ఆరోగ్య’మస్తు

పేదల ఆరోగ్య పరిరక్షణకే ప్రభుత్వం చిత్తశుద్ధితో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలు చేస్తోంది. - 8లో



శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది.

న్యూస్‌రీల్

పోలీసు సమస్యల పరిష్కారానికి కృషి



నవీన్‌కుమార్‌కు చెక్కు అందిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: పోలీసుశాఖలోని ప్రతి ఒక్కరి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్పీ మణికంఠ తెలిపారు. మంగళవారం చిత్తూరు పోలీసు అతిథిగృహంలో పోలీసు సంక్షేమానికి సంబంధించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా ఉద్యోగ విరమణ పొందిన ఏసీ వడివేలు (ఏఎస్ఐ), జ్ఞానప్రకాష్ (ఏఎస్ఐ), రమేష్ (ఏఆర్ ఎస్ఐ), రామచంద్ర (ఏఆర్ హెచ్‌సీ)ని ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఏళ్ల తరబడి పోలీసుశాఖకు అందించిన సేవలను కొనియాడారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాణిపాకం స్టేషన్ కానిస్టేబుల్ నవీన్‌కుమార్‌కు పోలీసుశాఖ తక్షణ సహాయ నిధి నుంచి రూ.50 వేల చెక్కును అందించారు. చిత్తూరు హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వస్తూ ఇటీవల మృతి చెందిన పట్టాభి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన సతీమణి గీతకు హోంగార్డు ఒక్క రోజు వేతన వితరణ నిధుల నుంచి రూ.4లక్షల చెక్కును అందజేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన పోలీసువారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎస్పీ భరోసా కల్పించారు.

ఫిరాయింపుదార్లకే టీడీపీలో ప్రాధాన్యం



దామోదర్ నాయుడు (టీడీపీ రెబల్)

పలమనేరు : జెండాలు మోసి.. కష్టపడే కార్యకర్తలకు టీడీపీలో గుర్తింపు ఉండదని, కేవలం ఫిరాయింపుదార్లకే ప్రాధాన్యముంటుందని, వారికే చంద్రబాబు టికెట్లు ఇస్తారని నందమూరి అభిమానం సంఘం జిల్లా అధ్యక్షుడు, టీడీపీ నేత దామోదర్‌నాయుడు అలియాస్ బుల్లెట్ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో టీడీపీ పలమనేరు టికెట్ కోసం విఫలయత్నం చేశానన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి చిత్తశుద్ధితో పనిచేస్తున్న తనను పొమ్మనకుండా పొగబెట్టి దూరం చేశారని మండిపడ్డారు. దీంతో పలమనేరు ఎమ్మెల్యే స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగినట్లు వెల్లడించారు. టీడీపీ అభిమానులు సహకరించి, సామాన్య కార్యకర్తను అయిన తనను ఆదరించాలని కోరారు.

సీఎంసీలో టీబీ క్లినిక్ ప్రారంభం



టీబీ క్లినిక్ ప్రారంభోత్సవంలో అధికారులు, సిబ్బంది

గుడిపాల: చీలాపల్లెలోని సీఎంసీ ఆస్పత్రిలో టీబీ క్లినిక్‌ను అడిషనల్ డీఎంహెచ్‌ఓ, జిల్లా టీబీ అధికారి వెంకటప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రెండు వారాలు దగ్గు, జ్వరం లక్షణాలు ఉన్న వారు నిర్ధారణ పరీక్షల కోసం టీబీ క్లినిక్‌ను సంప్రదించాలన్నారు. ఇక్కడ ఉచితంగా పరీక్షలు నిర్వహించి, చికిత్స అందించనున్నట్లు వెల్లడించారు. సీఎంసీ వంటి పెద్ద కార్పొరేట్ ఆస్పత్రులు ఇలాంటి సౌకర్యాలను సామాన్య ప్రజలకు కల్పించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం తరఫున ఎన్‌టీఈపీ ప్రోగ్రామ్ ద్వారా ఉచిత టీబీ నిర్ధారణ కిట్లు, మందులు సీఎంసీకి అందజేస్తున్నామని వివరించారు.

బాబువి బురిడీ హామీలు




ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు : టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో ఏమాత్రం అమలుకు సాధ్యం కాని బురిడీ హామీలను చంద్రబాబు ప్రకటించారని వైఎస్సార్‌సీపీ పలమనేరు ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే రూ.12లక్షల కోట్లు కావాలని, రాష్ట్ర బడ్జెట్టే రూ.3లక్షల కోట్లయితే మిగిలిన సొమ్ము ఎక్కడ నుంచి తీసుకువస్తారని ప్రశ్నించారు. ఎలాగైనా ప్రజలను ఏమార్చి ఎన్నికల్లో విజయం సాధించాలనే దురాలోచనతోనే చంద్రబాబు సూపర్ సిక్స్.. సూపర్ టెన్ అంటూ మోసపూరిత మేనిఫెస్టో విడుదల చేశారని ఆరోపించారు. మేనిఫెస్టోపై ప్రధానమంత్రి మోదీ ఫొటో లేనప్పుడే అర్థమైందని, ఇది పక్కా నకిలీ మేనిఫెస్టో అని విమర్శించారు.

ఊసరవెల్లి సిగ్గుపడుతోంది!

వీరిని చూస్తే రంగులు మార్చే ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుంది. నేను అప్పుడప్పుడూ రంగులు మార్చితే వీళ్లు ఎన్నికలొచ్చినప్పుడల్లా కండువాలు మార్చేస్తున్నారే..? అంటూ ఒంటికాలిపై లేస్తోంది. పిలిచి టిక్కెట్లిచ్చి.. ఎన్నికల్లో గెలిపించుకున్న తల్లిలాంటి పార్టీకి ద్రోహం చేస్తున్నారని మండిపడుతోంది. ప్రజాసేవను పక్కనబెట్టి స్వార్థ రాజకీయాల కోసం పరితపిస్తున్నారని విరుచుకుపడుతోంది.. అయితే.. వారి ప్రత్యర్థులను చూస్తే జాలేస్తోందని.. వారు సౌమ్యులు.. ప్రజాసేవకులని చెప్పుకొస్తోంది. అసలు జిల్లాలో అలాంటి వారు ఎవరు..? వారి కథా కమామిషు ఏంటో మీరే చదవండి..!

- విలువలకు తిలోదకాలు.. పార్టీలు మార్చడం వారి నైజం
- జనంలో గుర్తింపే లేని వారిని ఎంపీ, ఎమ్మెల్యే చేసిన వైఎస్సార్‌సీపీ
- తల్లిలాంటి పార్టీకి వెన్నుపోటు పొడిచి పచ్చ కండువా కప్పుకున్న వైనం
- జంపింగ్ జపాంగ్‌లు వరప్రసాద్, ఆదిమూలం, ఆరణిని ఛీదరించుకుంటున్న జనం
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులతో పోల్చుకుంటే నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా!



సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జంపింగ్ జపాంగ్‌లంటే ఠక్కున గుర్తుకొచ్చేది ఒకరు వెలగపల్లి వరప్రసాద్, ఆరణి శ్రీనివాసులు, ఆదిమూలం. ఈ ముగ్గురూ ఊసరవెల్లికి మించి రంగులు మారుస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. వీరు చొక్కాలు మార్చినంత ఈజీగా, పార్టీలు, కండువాలు మార్చే నాయకులని చర్చించుకుంటున్నారు. ప్రజాసేవకంటే సొంత ప్రయోజనాలే లక్ష్యంగా పార్టీలు మారుతుంటారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల సమయంలో పార్టీల కండువాలు మార్చడం అలవాటుగా మార్చుకున్నారని చర్చించుకుంటున్నారు. అయితే వీరి ఎంత స్వార్థపరులో ప్రస్తుతం బరిలో ఉన్న వీరి ప్రత్యర్థులు అంత సౌమ్యులని చెప్పుకుంటున్నారు.

దోపిడీకి ఆయనే ‘మూలం’

సత్యవేడు టీడీపీ అభ్యర్థి ఆదిమూలం స్వార్థ ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తారనే ప్రచారం ఉంది. ఆదిమూలం మొదట కాంగ్రెస్, ఆ తరువాత టీడీపీలో చేరారు. దళిత సామాజిక వర్గానికి చెందిన ఆదిమూలాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కున చేర్చుకుని సత్యవేడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా రెండు సార్లు ఎన్నికల బరిలో నిలిపారు. ఒకసారి ఓటమి పాలైనా.. రెండో పర్యాయం ఎమ్మెల్యేగా గెలిపించారు. కానీ ఆయన ప్రజలకు సేవ చేయడంలో విఫలమయ్యారు. ఇసుక, మట్టి అమ్ముకునేవారు. పరిశ్రమల నుంచి మామూళ్లు వసూళ్లు చేసేవారు. ఏదైనా సమస్యపై ఎమ్మెల్యే ఆదిమూలం వద్దకు వెళితే పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు బాధితులు చెబుతున్నారు. తండ్రి పదవిని అడ్డుపెట్టుకుని కుమారుడు సుమన్ చేయని అరాచకాలు లేవు. అధికారులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, విలేకరులపైన దౌర్జన్యాలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే ఆదిమూలానికి వైఎస్సార్‌సీపీ టికెట్ నిరాకరించింది.

రౌడీయిజం..ఆరణి నైజం

తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు చిత్తూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. మొన్నటి వరకు చిత్తూరు జిల్లా కేంద్రం. అభివృద్ధి చేసే అవకాశం ఉన్నా.. ఆయన అస్సలు పట్టించుకోలేదు. తమ సమస్యలపై వెళితే ఎంత ఇస్తావ్..? అని అడిగిన సందర్భాలెన్నో ఉన్నాయని బాధితులు చెబుతుంటారు. ఎమ్మెల్యే పదవిని అడ్డుపెట్టుకుని భూములు ఆక్రమించుకోవడం, అభివృద్ధి పనుల్లో పర్సెంటేజీలు, అధికారుల నుంచి మామూళ్లు, నమ్ముకున్న వాళ్లకు వెన్నుపోటు పొడవడం, రౌడీయిజం ఆరణి నైజం. ఆయన మొదట టీడీపీలో ఉంటూ.. టికెట్ ఇవ్వకపోతే ప్రజారాజ్యంలో చేరి చిత్తూరు అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. మరళా టీడీపీలో చేరారు. అప్పుడూ టీడీపీ టికెట్ ఇవ్వకపోవడంతో వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని ఎమ్మెల్యే అయిన ఆరణి స్వార్థ రాజకీయం కోసం జనసేనలో చేరి ప్రశాంతతకు మారుపేరైన తిరుపతిలో అలజడులు సృష్టిస్తున్నారు. స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

ఛీత్కారాలే ప్రజలకు ‘వరం’

తిరుపతి పార్లమెంట్ కూటమి అభ్యర్థి వరప్రసాద్ ఎదుటి వాళ్లను తిట్టడం, సొంత వాళ్లను ఆకాశానికి ఎత్తడం ఆయన నైజం. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని 2014లో తిరుపతి ఎంపీగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత గూడూరు ఎమ్మెల్యే అయ్యారు. అయితే ఆయన పనితీరు బాగాలేక పోవడంతో టికెట్ ఇవ్వలేదు. పదవుల రుచి మరిగిన ఆయన గారికి ఇప్పుడు దళిత జాతి ఆత్మగౌరవం గుర్తుకు రావడం విడ్డూరంగా ఉంది. దళితుల్ని జగన్ అణచివేస్తున్నారనే ఆయన గారి విమర్శలు విన్న జనానికి దెయ్యాలువేదాలు వల్లించినట్లుందని చెప్పుకుంటున్నారు. అధికారం కోసం ఆయన మొదట ప్రజారాజ్యం, ఆ తరువాత వైఎస్సార్‌సీపీ, ఇప్పుడు బీజేపీలో చేరారు. టీడీపీ, జనసేన వద్దంటే బీజేపీ కండువా కప్పుకుని కూటమి అభ్యర్థి అయ్యారు. ఇతను పదవి కోసం తప్ప ప్రజలతో సంబంధం లేదన్నట్టు వ్యవహరిస్తుంటారు. గతంలో ఆయన తిరుపతి ఎంపీగా కొనసాగినప్పటికీ,ప్రజానీకంతో సంబంధం లేకుండా, అలంకారప్రాయంగా ఉన్నారు. ఎవరైనా సమస్యతో వరప్రసాద్ దగ్గరికెళితే ఛీత్కరించుకున్న ఘటనలు బోలెడు. వరప్రసాద్ ఎంపీ, ఎమ్మెల్యే అయ్యారంటే కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువే.

గురుమూర్తి.. సదా సేవామూర్తి!

వైఎస్సార్‌సీపీ తిరుపతి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మద్దిల గురుమూర్తి మొహంపై ఎప్పుడూ చిరునవ్వు తొణికిసలాడుతుంటోంది. ఎవరు ఏ పని కోసం వెళ్లినా ఆప్యాయంగా పలకరించి అక్కున చేర్చుకోవడం ఆయన నైజం. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం సీఎం వైఎస్ జగన్ నుంచి నేర్చుకున్న విద్య. తిరుపతి పార్లమెంట్ పరిధిలో రహదారులు, తిరుపతి రైల్వేస్టేషన్ లాంటి ఎన్నో అభివృద్ధి పనుల్ని పరుగులు పెట్టించారు. పెద్ద ఎత్తున పరిశ్రమలు రావడానికి, కేంద్ర ప్రభుత్వ సంస్థలు జిల్లాకు రావడానికి ఆయన కీలకంగా వ్యవహరించారు.

అభినయ్..విజన్ ఉందోయ్!

తిరుపతిలో ఆరణి ప్రత్యర్థి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి తిరుపతి డిప్యూటీ మేయర్. ఆరణి శ్రీనివాసులు కొడుకు వయస్సు ఉంటుంది. కేవలం డిప్యూటీ మేయర్ పదవి ఉంటేనే తిరుపతి రూపు రేఖలు మార్చేశారు. సింపుల్‌గా చెప్పాలంటే.. 18 మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఫ్రీ లెఫ్టలు, ప్రధాన కూడళ్ల సుందరీకరణ, హైదరాబాద్ తరహాలో వినాయకసాగర్ అభివృద్ధి, చెన్నారెడ్డి కాలనీలోని పురాతన కోనేరు అభివృద్ధి, 22ఏలో ఉన్న ఇళ్ల స్థలాలకు విముక్తి కల్పించారు. 8 వేల కుటుంబాలకు మేలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఈ రోజు తిరుపతి మహానగరంగా విస్తరించిందంటే.. అందుకు అభినయ్ కృషే కారణం.

శభాష్..రాజేష్

ప్రస్తుత వైఎస్సార్‌సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్ ఉత్సాహవంతుడు, సౌమ్యుడు, మంచివాడు. ప్రజాసేవ చేయాలనే లక్ష్యంతో మొదటి సారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. నియోజకవర్గానికి కొత్తవారైనా.. కొద్ది రోజులకే స్థానికులకు దగ్గరయ్యారు. ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నారు. సత్యవేడు ప్రజలు నూకతోటి రాజేష్‌ని ఇప్పుడు ‘మా వాడు’ అంటుండడం విశేషం.

సుపరిపాలనతో సంక్షేమ విప్లవం



ప్రచార వాహనంపై ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సుపరిపాలనతో సంక్షేమ విప్లవానికి శ్రీకారం చుట్టారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కొనియాడారు. మంగళవారం మండలంలోని కొల్లాగుంట పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పేదలకు జరిగిన మేలు శూన్యమన్నారు. 2014 ఎన్నికల్లో కూడా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి 600 హామీలిచ్చి అధికారంలోకి రాగానే పట్టించుకోలేదని విమర్శించారు. మాయమాటలు, ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేయడం బాబుకు వెన్నెతో పెట్టిన విద్యని మండిపడ్డారు. బాబు చేసిన మోసాలకు 2019 ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉదయించే సూర్యుడని, చీకటిలోని పేదలకు ఆర్థికంగా అండగా నిలిచి వెలుగులు పంచారని వివరించారు. చేనేత కార్మికులకు నిలయమై కొల్లాగుంట గ్రామం దశ దిశ మార్చారని తెలిపారు. బాబు హామీలు నీటిమీద రాతలని, అది ఎప్పటికీ కనిపించవని స్పష్టం చేశారు. గత టీడీపీ పాలనకు, ఈ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి గల తేడాను ప్రజలు గమనించాలని సూచించారు. ఎస్సీ, బీసీల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తున్న దార్శనికుడు జగనన్న అని కొనియాడారు. పేదలు పవిత్రంగా భావిస్తున్న నవరత్న పథకాలను చంద్రబాబు, ఎల్లోమీడియా విమర్శించడం దారుణమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి జోలికి వస్తే ప్రజలే రాజకీయ సమాధి కడతారని హెచ్చరించారు. ఈ ఎన్నికలతో టీడీపీ భూస్థాపితం కావడం తథ్యమని స్పష్టం చేశారు. ఎంపీపీ లత, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, కో–ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ దివ్య, మాజీ సర్పంచ్ మునికృష్ణ, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ సుగుణమ్మ, నందగోపాల్, అశోక్, సుబ్రమణ్యం, గాంధీ పాల్గొన్నారు.

బాబు హామీలు మేనిఫెస్టోకే పరిమితం



జంబాడ ఆదిఆంధ్రవాడ వాసులతో మాట్లాడుతున్న మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి రోజా

విజయపురం : చంద్రబాబు హామీలు మేనిఫెస్టోకే పరిమితమని, అవి ఎప్పటికీ అమలు చేయరని మంత్రి, నగరి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని జంబాడ, చిన్నజంబాడ, జంబాడ ఆది ఆంధ్రవాడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు అడుగడుగునా అపూర్వ స్వాగతం పలికారు. వృద్ధులు ఆశీర్వచనాలు అందించారు. తమకు సంక్షేమ ఫలాలు, అభివృద్ధి పథకాలను అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా ఉంటామని గ్రామస్తులు తెలిపారు. ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పిలిస్తే పలికే నేత రోజమ్మను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని వెల్లడించారు. అనంతరం మంత్రి రోజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. అందులో భాగంగానే 2019 ఎన్నికల మేనిఫెస్టోను తూచా తప్పకుండా అమలు చేశారని చెప్పారు. ప్రజలకు మరింతగా పథకాలు అందించేందుకే ఈ ఎన్నికలకు ఉత్తమ మేనిఫెస్టో విడుదల చేశారని తెలిపారు. జగనన్న సహకారంతోనే నగరి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దామన్నారు. ఈ క్రమంలోనే జంబాడ ఉన్నత పాఠశాలను రూ.70.70లక్షల వ్యయంతో కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశామని వెల్లడించారు. రూ.2కోట్లతో చిన్నజంబాబ–ఇల్లత్తూరు రోడ్డు నిర్మించామని వివరించారు. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించామన్నారు. ప్రజలకు మంచి చేసి ఓటు అడుగుతున్నామని, మే 13వ తేదీన పోలింగ్ రోజు ఈవీఎంలో 3వ నంబర్‌లో ఉన్న ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కి, మూడో పర్యాయం ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. చంద్రబాబు మాయ మాటలు నమ్మవద్దని, ఎన్నికల సమయంలో నోటికొచ్చిన హామీలు ఇచ్చి తర్వాత వాటిని పట్టించుకోరని స్పష్టం చేశారు. ఆయన హామీలను కేవలం మేనిఫెస్టోలో మాత్రమే చూసుకోవాలని విమర్శించారు. అది కూడా మళ్లీ కనిపించకుండా చేస్తారని వివరించారు. ఈవీఎంలో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకే వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గోపీనాథ్, ఆర్‌బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, రవినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రాజగోపాల్, నర్సరాజు, భాస్కర్‌రెడ్డి, శివరాజు, కిషోర్‌రెడ్డి, సర్పంచ్ భాస్కర్‌రాజు, వెంకటేశులు, హరినాయుడు, కో–ఆప్షన్ మెంబర్ రాజేంద్రన్, రామచంద్రరాజు, కుమార్‌రెడ్డి, కుమార్, సర్పంచ్ బాబు, ప్రసన్న, జిల్లుదాస్, గోవిందన్, ప్రకాష్ పాల్గొన్నారు.



వృద్ధుడి యోగక్షేమాలు విచారిస్తూ..

నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల అబ్జర్వర్ రామ్ మోహన్ మిశ్రా ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లాకు విచ్చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై అధికార యంత్రాంగంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన ఎన్నికల కసరత్తును జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల అబ్జర్వర్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకూడదన్నారు. శాంతిభద్రతల విషయంలో ఎస్పీ పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది నిబంధనలకు లోబడి విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో స్వీప్ (ఓటరు అవగాహన) కార్యక్రమాలు బాగా నిర్వహించారని జిల్లా ఎన్నికల అధికారిని అభినందించారు. మద్యం, నగదు పంపిణీ జరగకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. తనిఖీల్లో సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ట్రై సైకిల్, ర్యాంపులను ఏర్పాటు చేశామని చెప్పారు. ఎన్నికల పటిష్ట నిర్వహణకు 16 మంది నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. సి–విజిల్‌లో అందిన ఫిర్యాదులను 89 శాతం పూర్తి చేశామన్నారు. ఇప్పటి వరకు రూ.2.36 కోట్లు నగదు సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి అల్లర్లు జరగకుండా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. మార్చి 16వ తేదీ నుండి ఇప్పటి వరకు 821 బైండోవర్ కేసులు పెట్టామన్నారు. జిల్లాలో 21 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో అబ్జర్వర్లు కైలాష్ వాంఖడే, షాదిక్ ఆలం, పోలీస్ అబ్జర్వర్ అమ్రిత్ రాజ్, చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేక అబ్జర్వర్ రామ్ మోహన్ మిశ్రా

అతివలదే ఆధిపత్యం

- జిల్లాలో మొత్తం 15,63,911 మంది ఓటర్లు
- మహిళలు 7,93,682
- పురుషులు 7,70,154

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికలకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికల నిర్వహణ కీలకమైన ఓటర్ల జాబితా కసరత్తు పూర్తి చేసింది. ఈ మేరకు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, చిత్తూరు పార్లమెంట్ స్థానానికి సంబంధించి ఓటర్ల జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ ప్రకటించారు. ఆ మేరకు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 15,63,911 మంది ఓటర్లు, చిత్తూరు పార్లమెంట్‌లో 16,40,202 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. చిత్తూరు జిల్లా అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ, చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గంలోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. పురుషులు 7,70,154 మంది, మహిళలు 7,93,682 మంది, ఇతరులు 75 మంది ఓటర్లు ఉన్నట్లు జాబితాలో పేర్కొన్నారు. అలాగే ఎన్ఆర్ ఓటర్లు 167 మంది, సర్వీస్ ఓటర్లు 3,380 మంది ఉన్నారు. 18–19 ఏళ్ల వయస్సున వారు 40,450 మంది, 85 ఏళ్లు పైబడిన వారు 6,485 మంది, దివ్యాంగులు 23,526 మంది ఉన్నట్లు వివరించారు.

ఫిర్యాదులకు ప్రత్యేక నంబర్లు



షణ్మోహన్, జిల్లా ఎన్నికల అధికారి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన మోడల్ కోడ్ ఉల్లంఘనలు ఉంటే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు తెలియజేయాలని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్రమ మద్యం, ఓటర్లకు నగదు పంపిణీకి సంబంధించిన సమాచారం తెలియజేయాలని కోరారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఫిర్యాదులు చేయాల్సిన అధికారి, నంబర్లను వివరించారు. లక్ష్మీప్రసన్న (ట్రైనీ డిప్యూటీ కలెక్టర్) – 9603404789, శేషగిరి (ఎస్ఐ)–9849962578, కృష్ణకిషోర్ (ఎస్ఐ)–8019396602, విజయ భాస్కర్ (డీఏఓ)–9491077011 ఫిర్యాదు చేయాలని సూచించారు.

క్లుప్తంగా

విద్యార్థి మృతదేహం వెలికితీత

నగరి : పట్టణ పరిధిలోని కనంమిట్ట వద్ద బావిలో మునిగిపోయిన విద్యార్థి మృతదేహాన్ని మంగళవారం ఉదయం వెలికితీశారు. వివరాలు.. కాకవేడు గ్రామానికి చెందిన వాసు కుమారుడు టి.మూర్తి (19) సోమవారం సాయంత్రం మిత్రులతో కలిసి కనంమిట్ట క్రషర్ల వద్ద బావిలో ఈతకు వెళ్లాడు. బావిలోకి దూకిన మూర్తి ఎంతకూ బయటకు రాకపోవడంతో వెతికి చూసిన స్నేహితులు అగ్నిమాపక అధికారి సుబ్బరాజుకు సమాచారం అందించారు. ఆయన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. ఇంతలో చీకటి పడడంతో విద్యార్థి మృతదేహం దొరకలేదు. దీంతో మంగళవారం ఉదయం మళ్లీ బావిలో గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు మూర్తి మృతదేహాన్ని బయటకు తీశారు. కాగా, మూర్తి స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. తల్లిదండ్రులకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు. ఒక్కగానొక్క కుమారుడు మృత్యువాత పడడంతో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగిపోయారు.

యాక్సిడెంట్ కేసులో నిందితుడికి జైలు

చిత్తూరు అర్బన్: మద్యం మత్తులో కారు నడిపి, బాలిక మృతికి కారణమైన కేసులో నిందితుడు రూబన్(40)కు పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ చిత్తూరులోని 8వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం మంగళవారం తీర్పునిచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పులికల్లు రవీంద్రనాథ్‌రెడ్డి కథనం మేరకు.. యాదమరి మండలం బజారువీధికి చెందిన శేఖర్‌బాబు అక్కడే కిరాణా దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. అతడికి ముగ్గురు కుమార్తెలు. ఈ క్రమంలో భార్య, పిల్లలు కలిసి 2019లో గిరింపేటలోని తన బంధువుల ఇంటికి వెళ్లారు. ఏప్రిల్ 13న ఇతని కుమార్తెలు రెడ్డినాగలక్ష్మి (18), జ్ఞానసుధ (16) కలిసి గిరింపేట చౌడేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద నడిచివెళుతుండగా వేలూరు నుంచి చిత్తూరు వైపు వస్తున్న ఓ కారు వీళ్లను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరినీ స్థానికులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆ ప్రమాదంలో రెడ్డినాగలక్ష్మి మృతి చెందింది. దీనిపై చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. చిత్తూరులోని ఇరువారానికి చెందిన రూబన్ మద్యం మత్తులో నిర్లక్ష్యంగా కారు నడిపి ప్రమాదానికి కారణమైనట్లు గుర్తించి, కేసు నమోదుచేసి కోర్టుకు తరలించారు. నేరం రుజువుకావడంతో నిర్లక్ష్యంగా వాహనం నడిపి బాలిక మృతికి కారణమైనందుకు పదేళ్ల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. అలాగే మరో బాలిక గాయాలకు కారణమైనందుకు ఆరు నెలల జైలుశిక్ష, రూ.500 జరిమానా, మద్యం సేవించి వాహనం నడిపినందుకు మరో ఆరు నెలల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సుంకర శ్రీదేవి తీర్పునిచ్చారు.



‘ఆరోగ్య’మస్తు

- పేదలకు ఆయువు పోస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ
- లక్షలాది మందికి ఆలంబనగా నిలుస్తున్న విశిష్ట పథకం
- 2019 నుంచి ఇప్పటి వరకు 3.23 లక్షల మందికి శస్త్రచికిత్సలు
- ఐదేళ్లలో రూ.368 కోట్లు ఖర్చు చేసిన సర్కారు

వైఎస్సార్ ఆరోగ్య శ్రీ.. ఇది కేవలం పథకం మాత్రమే కాదు. రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులకు భరోసా. సామాన్యుడికి సైతం ఉచితంగా కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్సలందించే అపర సంజీవని. నెలాఖరున బిడ్డకు సుస్తీ చేస్తే నిస్సహాయంగా ఖాళీ పర్సును తడిమి చూసుకునే మధ్యతరగతి మనిషికి అభయ హస్తం. పొరపాటున పెద్ద జబ్బేదో వస్తే రోగి కంటే ఎక్కువగా యాతన అనుభవించే ఆ ఇంటి పెద్దకు తోడుగా నిలిచే ఆత్మ బంధువు. పేదవాడిది కూడా ప్రాణమేనని, వారి ఉసురుకు బాధ్యత తీసుకునే ప్రభుత్వం మీకు ఉందని నిరంతరం గుర్తు చేసే ఆత్మీయ నేస్తం. ఈ కార్డు కనిపిస్తే.. సగటు జీవికి ఓ నమ్మకం. అందులో కుటుంబ సభ్యుల పేర్లు కనిపిస్తే గుండెల్లో ఓ ధైర్యం.

కాణిపాకం : జిల్లాలో 73 నెట్‌వర్క్ ఆస్పత్రులు, 7 డెంటల్ హాస్పిటళ్లు ఉన్నాయి. అలాగే జిల్లావ్యాప్తంగా మొత్తం 4,73,877 కుటుంబాలకు వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డులు ఉన్నాయి. వీరిలో ఏటా 50 వేల నుంచి 70వేల మంది వరకు ఈ ఆరోగ్య శ్రీ పథకం కింద సేవలను పొందుతున్నారు. ఇందు కోసం ప్రభుత్వం ఏటా రూ.90 కోట్లకు పైగానే వ్యయం చేస్తోంది. దీనికి తోడు ఆరోగ్యశ్రీ ఆసరా కూడా అందిస్తోంది. గతంలో ఈ ఆరోగ్యశ్రీ పరిధిలో 1,059 ప్రొసీజర్స్ ఉండగా, ఇప్పుడు ఏకంగా 3,257 వ్యాధులను (ప్రొసీజర్స్) ఈ పరిధిలోకి తీసుకువచ్చారు. అలాగే గుండె జబ్బుతో పాటు క్యాన్సర్ వంటి అతిపెద్ద వ్యాధులను సైతం ఆరోగ్యశ్రీకి చేర్చారు. వెయ్యి రూపాయలు దాటిన ప్రతి ప్రొసీజర్ ను ఉచితంగా చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే ఆరోగ్యశ్రీ పరిధిని ఏకంగా రూ.25 లక్షల వరకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కాగా, 2019 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 3.23 లక్షల మందికి వివిధ రకాల శస్త్ర చికిత్సలు చేయించింది. ఇందుకోసం రూ.368 కోట్లకు పైగా ఖర్చు చేసింది.

ఆసరాగా...

ఆరోగ్య శ్రీ పథకం 3,257 ప్రొసీజర్లలో చికిత్సలు పొందిన వారిని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసే సమయంలో వైద్యులు సూచించిన విశ్రాంత సమయానికి రోజుకు రూ.225 లేదా నెలకు గరిష్ఠంగా రూ.5వేలను ప్రభుత్వం అందిస్తోంది. రోగి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన రోజే ఈ మొత్తాన్ని రోగులు, వారి కుటుంబీకుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగానే గర్భిణిలకు ప్రసవానంతరం రూ. 5వేలు చొప్పున సాయం అందిస్తోంది. ఈక్రమంలో ఐదేళ్లగా రూ.154.68 కోట్లు వైఎస్సార్ ఆసరా కింద వెచ్చించింది.

గతంలో గడ్డుకాలం...

గత ప్రభుత్వంలో వైద్యరంగంలో గడ్డు కాలం నడిచింది. అప్పటి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవలను అందని ద్రాక్షగా మార్చేసింది. వారికి అనుకూలమైన ఆస్పత్రులను పోషించే ప్రయత్నం చేసింది. పేదల ప్రాణాలను గాలికొదిలేసింది. దీంతో సక్రమంగా ఆరోగ్య శ్రీ సేవలు అందక రోగులు అల్లాడిపోయారు. నెనెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సరైనా వైద్యం అందక అవస్థలు పడ్డారు. గత ప్రభుత్వ అలసత్వం కారణంగా వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో ప్రజలకు ప్రైవేటు ఆస్పత్రులే దిక్కుగా మారాయి. అప్పో సప్పో చేసి ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరాల్సిన దుస్థితి ఏర్పడింది.

స్మార్ట్ కార్డుల పంపిణీ పూర్తి

ఆరోగ్యశ్రీ పథకంపై క్షేత్రస్థాయిలో అవగాహన పెంపొందించలనే సదుద్దేశంతో ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. అందులో భాగంగా స్మార్ట్ కార్డుల పంపిణీని కొద్ది నెలల క్రితమే ప్రారంభించింది. జిల్లా వైద్యాఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలతో ఆండ్రాయిడ్ ఫోన్లలో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించి, ఎలా వినియోగించాలలో వివరించింది. ఈ మేరకు జిల్లాలో ఇప్పటికే మొత్తం 4,73,877 లక్షలకుపైగా స్మార్ట్ కార్డుల పంపిణీని పూర్తి చేయించింది.

ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్సల సమాచారం

సంవత్సరం	సర్జరీలు	వ్యయం (రూ.కోట్లలో)
2019-20	43,988	96.29
2020-21	51,173	99.71
2021-22	75,941	13.48
2022-23	83,816	18.015
2023-24	68,436	140.97

ప్రాణం పోశారు..



నేను బీహార్‌లో వెల్డింగ్ పనిచేసేవాడిని. తర్వాత సొంత గ్రామమైనా గుడిపాల మండలం, కట్టకిందపల్లెకు వచ్చేశా. నాకు పిల్లలు లేరు. మూడేళ్ల క్రితం భార్య కూడా చనిపోయింది. ఉన్నట్టుండి గత ఏడాది గుండె నొప్పి వచ్చింది. ఆస్పత్రికి వెళ్లి పరీక్షిస్తే..వాల్స్ దెబ్బతిన్నాయని డాక్టర్లు చెప్పారు. ఎవరు లేని వారికి దేవుడే దిక్కన్నట్లు.. నన్ను వైఎస్సార్‌ఆరోగ్యశ్రీ ఆదుకుంది. అన్న కుమార్తెలు సాయంతో కోలార్‌లోని ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకున్నా. 2022 జూన్‌లో రెండు స్టంట్లు పెట్టారు. తర్వాత 2023లో మరో రెండు స్టంట్లు అమర్చారు. ఇందుకు గాను రెండు విడతలుగా రూ. 2.40 లక్షలను ప్రభుత్వం భరించింది. తర్వాత ఆరోగ్య శ్రీ ఆసరా కింద రూ.4795లను నా బ్యాంకు ఖాతాలో జమ చేశారు. రవాణా ఖర్చులు కూడా ఇచ్చి పంపారు. ఆస్పత్రిలో ఉన్నంత వరకు ఉచిత భోజనం అందించారు.ఇప్పుడు దేవుడి దయ, ఆ ఆరోగ్యశ్రీ పుణ్యమా అని బాగున్నా.

– నేషన్, కట్టకిందపల్లె, గుడిపాల మండలం

పైసా ఖర్చు లేకుండా..





నేను చిత్తూరులోని బాలాజీ కాలనీలో నివాసముంటా. తినుబండారాల దుకాణం, క్యాటరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నా. రెండు నెలలకు క్రితం కంటి పొర దెబ్బతింది. పరీక్షలు చేసిన డాక్టర్లు వెంటనే కంటి ఆపరేషన్ చేసుకోవాలన్నారు. నాకు వచ్చే ఆదాయంతో ఆస్పత్రికి ఖర్చు పెట్టే స్తోమత లేదు. తెలిసిన వాళ్ల సాయంతో ఆరోగ్య శ్రీ వివరాలు తెలుసుకుని తిరుపతిలోని ఓ కంటి ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకున్నా. ఆరోగ్య శ్రీ ఖర్చులు పోను నా బ్యాంకు అకౌంట్‌కు రూ. 4వేలు వేశారు. ఇప్పుడు కంటి చూపు బాగా ఉంది. పని చేసుకోగలుగుతున్నా. ఈ సమయంలోనే నా భార్య అజీదున్‌కు ముక్కు సంబంధిత సమస్య వచ్చింది. ఆరోగ్య నెట్‌వర్క్ ఆస్పత్రికి వెళ్లి మూడు నెలల క్రితం ఆపరేషన్ చేయించా. ఇందుకు కూడా రూపాయి ఖర్చు కాలేదు. ఎవరూ మమ్మల్ని పైసా అడగలేదు. నా భార్యకు కూడా ఆసరా నగదు రూ. 4వేలను బ్యాంకు ఖాతాకు జమ చేశారు. మొత్తం మీద పైసా ఖర్చు లేకుండా ఇద్దరం చికిత్సలు పొందాం.

– జలీల్, అజీదున్, బాలాజీ కాలనీ, చిత్తూరు

రుణపడి ఉంటాం



నేను దినసరి కూలీని. రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు మాది. వచ్చే ఆదాయంతో కుటుంబానికి తోడుగా ఉంటున్నా. ఇటీవల నాకు గుండె నొప్పి వచ్చింది. ఆస్పత్రికి వెళితే వైద్యుల పరీక్షించి వెంటనే శస్త్ర చికిత్స చేయాలన్నారు. మాకు డబ్బు పెట్టుకునే స్తోమత లేదు. దీంతో బంధువుల సలహామేరకు ఆరోగ్య మిత్రను సంప్రదించి ఆరోగ్యశ్రీ పథకానికి దరఖాస్తు చేసుకున్నా. ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించుకున్నా. నేను పైసా ఇవ్వలేదు. కానీ, నాచేతికే డబ్బులు ఇచ్చారు. నాకు జీవం పోసిన ముఖ్యమంత్రికి ఎప్పటికీ రుణపడి ఉంటా.

– సెల్వి, సత్యనారాయణపురం, చిత్తూరు

హత్యకేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: నగరంలోని తోటపాళ్యంలో గత వారం ఆశిక్ అనే యువకుడి హత్య కేసులో ప్రధాన నిందితుడు బద్రి (30)ని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. టూటౌన్ సీఐ ఉలసయ్య కథనం మేరకు.. కేరళకు చెందిన ఆశిక్ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండు నెలల కిందట తిరుపతి నుంచి చిత్తూరుకు వచ్చి భార్య, పిల్లలతో కలిసి తోటపాళ్యంలో కాపురముంటున్నాడు. అతడికి చిత్తూరులో పవన్ కల్యాణ్, బద్రితో పరిచయం ఏర్పడింది. అవసరాల కోసం వీళ్లిద్దరూ వారి సెల్‌ఫోన్లను, ఒక్కొక్కటి రూ.500 చొప్పున.. మొత్తం రూ.వెయ్యికి ఆశిక్ వద్ద కుదువ పెట్టారు. ఏప్రిల్ 25వ తేదీ రాత్రి ఓబనపల్లె వద్ద ఉన్న మద్యం దుకాణం ప్రాంగణంలో తమ సెల్‌ఫోన్ ఇచ్చేయాలని ఆశిక్‌తో బద్రి, పవన్ కల్యాణ్ గొడవపడ్డారు. ఫోన్ ఇవ్వనని చెప్పి ఆశిక్ ఇంటికి బయలుదేరాడు. దీంతో ఆగ్రహించిన ఇద్దరు నిందితులు ఆశిక్‌ను వెంటాడి మరీ కత్తితో నరికి చంపేశారు. ఈ కేసులో గంగనపల్లెకు చెందిన పవన్ కల్యాణ్‌ను ఇప్పటికే అరెస్ట్ చేయగా, ప్రధాన నిందితుడు సంతపేటకు చెందిన బద్రిని తాజాగా అదుపులోకి తీసుకున్నారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ప్రాణం తీసిన కునుకు!



మృతి చెందిన సుశీలమ్మ

చంద్రగిరి: కునుకు ఓ నిండు ప్రాణాన్ని తీసింది. మరో నలుగురిని ఆస్పత్రి పాలు చేసింది. ఈ ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ముంగిళిపట్టు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటక బంగారుపేటకు చెందిన మురళీధర్ తన కుటుంబ సభ్యులతో కలసి కారులో సోమవారం తిరుమలకు చేరుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం మంగళవారం తెల్లవారుజామున తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ముంగిళిపట్టు వద్ద వెళ్తున్న క్రమంలో డ్రైవర్ అమర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. కారు కల్వర్టును ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న మురళీధర్ భార్య సుశీలమ్మ (59) అక్కడికక్కడే మృతి చెందింది. కుమార్తె అనూష, కుమారుడు అమర్, కోడలు ఉమా తీవ్రంగా గాయపడ్డారు. కారులోని ముగ్గురు చిన్నపిల్లలు క్షేమంగా బయటపడ్డారు. కేసు దర్యాప్తులో ఉంది.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



మంత్రి రోజా సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రవి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వెంకటేగౌడ, రెడ్డెప్ప

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వెంకటేగౌడ, రెడ్డెప్ప

పెద్దపంజాణి: మండలంలోని ముత్తుకూరు పంచాయతీ పరిధిలో గల పోలేపల్లి, బ్రాహ్మణపల్లి, నెర్లిపల్లి, ముత్తుకూరు గ్రామాలకు చెందిన సుమారు 70 కుటుంబాలు, అలాగే నాగిరెడ్డిపల్లి పంచాయతీ చల్లావారిపల్లికి చెందిన 40 కుటుంబాల టీడీపీ నాయకులు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే వెంకటేగౌడ

మేలు చేశాం.. మరోసారి గెలిపించండి

త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలు పేదలు, పెత్తందార్ల మధ్య సాగే యుద్ధం వంటిదని, పేదల పక్షాన నిలిచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి సహకరించాలని ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వెంకటేగౌడ, రెడ్డెప్ప ప్రజలను కోరారు. మంగళవారం మండలంలోని ముత్తుకూరులో పార్టీ శ్రేణులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలప్పుడే చంద్రబాబుకు ప్రజలు గుర్తుకొస్తారని, ఆయన మాయమాటలు, బూటకపు హామీలను నమ్మి ఎవరూ మోసపోవద్దన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలన్నా, సక్రమంగా పథకాలు అందాలన్నా అందరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రెడ్డెప్పను గెలిపించాలని అభ్యర్థించారు.

వైఎస్సార్‌సీపీలోకి మార్కెట్ శేఖర్..

చిత్తూరు కార్పొరేషన్: టీడీపీ నాయకులు మభ్యపెట్టి పార్టీ కండువా కప్పారని, తమ తప్పు తెలుసుకుని తిరిగి వైఎస్సార్‌సీపీలోకి వచ్చినట్లు స్థానిక కూరగాయల మార్కెట్ శేఖర్ తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానంద రెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఎన్నికల సమయంలో టీడీపీ ప్రలోభాలకు లొంగవద్దని హితవు పలికారు.

వైఎస్సార్‌సీపీలోకి మాజీ జెడ్పీటీసీ కుమారుడు

నింద్ర : మండలంలోని అత్తూరు దళితవాడకు చెందిన టీడీపీ మాజీ జెడ్పీటీసీ దివంగత దొరస్వామి కుమారుడు ఆరె రవి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అత్తూరు మాజీ ఎంపీటీసీ సభ్యులు ఏలుమలై, సచివాలయ కన్వీనర్ మునిరాజ్, బూత్ కమిటీ సభ్యులు బాషా, నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం మంత్రి నివాసంలో మంత్రి ఆర్‌కే రోజా సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. మంత్రి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కుటుంబంతో సహా మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన కూరగాయల మార్కెట్ శేఖర్‌తో విజయానందరెడ్డి

తప్పుడు కేసులు పెట్టి పరార్!

- తమ వాహనాలను తామే ధ్వంసం చేసుకుని వైఎస్సార్‌సీపీ నేతలపై నెపం
- బీసీవై అధినేత రామచంద్రయాదవ్ నిర్వాకం

పుంగనూరు : సదుం మండలం ఎర్రాతివారిపల్లెలో సోమవారం జరిగిన దాడులకు సంబంధించి బీసీవై అధినేత బోడే రామచంద్ర యాదవ్ తప్పుడు కేసులు పెట్టి పరారయ్యారు. అనుమతి లేకుండా ప్రచారానికి వెళ్లి అల్లర్లు సృష్టించి లాభపడాలనుకున్న ఆయన తాను తీసిన గోతిలో తానే పడ్డారు. తమ వాహనాలను తామే ధ్వంసం చేసుకుని, వైఎస్సార్ సీపీ నాయకులు దాడి చేశారంటూ నానా యాగీ చేశారు. డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మణికంఠ మండల కేంద్రానికి చేరుకుని ఘటనపై లోతుగా దర్యాప్తు చేపట్టారు. బీసీవై నాయకులపై హత్యాయత్నం కేసు, దౌర్జన్యం, మహిళలతో దురుసుగా ప్రవర్తించడంపై రెండు కేసులు నమోదు చేశారు. అలాగే వైఎస్సార్ సీపీ నాయకులు 10 మందిపై కేసులు నమోదు చేశారు. కేసులు నమోదు కావడంతో మంగళవారం వేకువ జామునే తన అనుచరులు హరినాథరెడ్డి, ఆనందరెడ్డితో కలిసి యాదవ్ పరారయ్యారు. దౌర్జన్యం, మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడంతో బోడే రామచంద్ర యాదవ్, శివకుమార్, ఓంప్రకాష్, కపీ, వెంకటేష్, ప్రసాద్, పరదేశి, భరత్ కుమార్, ఆనంద రెడ్డి తదితరులపై కేసు నమోదైంది. దౌర్జన్యం, హత్యాయత్నంకు సంబంధించి రామచంద్ర యాదవ్, రమేష్ యాదవ్, ఓంప్రకాష్, శివకుమార్, విశ్వనాథ్, లోకనాథం, ఆనందరెడ్డి, అనిల్‌కుమార్ రెడ్డి, హరినాథ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, భరత్ కుమార్, పరదేశి, వెంకటేష్‌పై కేసు నమోదు చేశారు.